నమస్తే తెలంగాణ
మెదక్

13 | హైదరాబాద్, గురువారం 14 మార్చి 2024 | MEDAK

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు

- నీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు
- గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తిచేసి రైతులకు నీళ్లందించడమే లక్ష్యంగా పనిచేస్తా
- హుస్నాబాద్ దవాఖానను 250 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తాం
- అన్ని కులాల వారికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత మా ప్రభుత్వానిదే
- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మార్చి 13: హుస్నాబాద్ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించినట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రూ.18.50 కోట్లతో హుస్నాబాద్ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, రూ.98.23 లక్షలతో హుస్నాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో వివిధ పనుల నిర్వహణ పనులకు బుధవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన శంకుస్థాపన చేశారు. అంతకుముందు రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న మండల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రితో మాట్లాడి రూ.3.50 కోట్లు, తన నిధుల నుంచి రూ.1.50 కోట్లు మొత్తం రూ.5 కోట్లను తాగునీటి ఎద్దడి నివారణకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో నిర్మించిన నూతన డిగ్రీ కళాశాల భవనంలోకి పాత భవనం నుంచి షిఫ్ట్ చేయాలని ఆదేశించామన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో 25 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, రాష్ట్రంలో కొత్తగా వెయ్యి బస్సులను కొనుగోలు చేయబోతున్నామని తెలిపారు. 40 ఏండ్ల క్రితం నిర్మించిన హుస్నాబాద్ బస్టాండ్‌ను రూ.2 కోట్లతో ఆధునీకరిస్తున్నామన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్ కాలువ పనులను వెంటనే పూర్తి చేయించి, రైతుల పొలాలకు నీళ్లందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో త్వరలోనే ఫ్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. హుస్నాబాద్‌లో ప్రస్తుతం ఉన్న 100పడకల దవాఖానను 250పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రియాంకగాంధీ ఇచ్చిన హామీ ప్రకారం హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు చేసిన బీసీ డిక్లరేషన్‌కు అనుగుణంగా 16కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికలకు ముందే రాజకీయాలు ఉంటాయని, తరువాత అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోతున్నామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల గౌరవం పెంచేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, జడ్పీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి, ఆర్డీవో బెన్‌షాలోమ్, మున్సిపల్ వైస్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, స్థానిక కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు తెలుపుతున్న అనంతుల ప్రశాంత్ దంపతులు

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు

కొండపాక (కుకునూరుపల్లి), మార్చి 13: భారత జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజు సందర్భంగా బుధవారం భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్, ఆయన సతీమణి కొండపాక జడ్పీటీసీ అనంతుల అశ్విని హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మెళకువలతోనే మామిడిలో.. అధిక దిగుబడి

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 13: ఈ ఏడాది మామిడికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నా, మార్చిలో తగు జాగ్రత్తలు పాటిస్తేనే అధిగ దిగుబడి సాధించవచ్చని కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగహర్షిత సూచిస్తున్నారు. ఉద్యాన శాస్త్రవేత్తల, అధికారుల సూచనలు ఎంతో కీలకమని ఆమె చెప్పారు. మామిడి ప్రస్తుతం పిందె, కాత దశలో ఉందన్నారు. పిందె, కాయలపై తేనెమంచు, కాండం తొలుచు, కాయతొలుచు పురుగులు, మసిమంగు, పిండి నల్లి, బూడిద తెగుళ్లు అధికంగా కనిపిస్తున్నాయని తెలిపారు. వెంటనే తగు జాగ్రత్తలు పాటించకపోతే అపార నష్టం వాటిళ్లుతుందన్నారు. కాయ పెరుగుదల దశలో వీలైనంత వరకు డ్రిప్ ద్వారా చెట్టుకు నీరందించాలని సూచించారు. కాయలకు కవర్ తొడుగు ఉంచడంతో ఆరోగ్యంగా పెరుగుతుందని సూచించారు.

తెలంగాణ నుంచే అధిక దిగుబడి

ఈసారి రాష్ట్రం నుంచి మామిడి అధిక దిగుబడి రానుందన్నారు. మెళకువలతో మామిడిని రక్షిస్తే ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి అధిక లాభాలు పొందవచ్చన్నారు. మామిడిని దేశంలోనే అధికంగా సాగుచేసేది తెలంగాణేనని, అందుకు ఇక్కడి వాతావరణ పరిస్థితులు, నేలలు అనుకూలమని వెల్లడించారు. ప్రస్తుతం తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

తేనె మంచు పురుగు

ఈ పురుగు ఆకు, పువ్వు, పిందెలపై చేరి రసాన్ని పీలుస్తామన్నారు. పూత, పిందె వాడిపోయి రాలిపోతుందన్నారు. పురుగు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై మసిగల శిలీంధ్రాలు పెరుగుతాయని తెలిపారు. దీంతో నల్లని మసిమంగు ఏర్పడుతుందన్నారు. ఈ పురుగు కాయలేని కాలంలో కొమ్మల బెరడులోని దాగి ఉంటుందని, అనంతరం లేత ఆకులపై, పూరెమ్మలపై ఉంటుందన్నారు. వాతావరణ పరిస్థితుల్లో హెచ్చుతగ్గులు, అంటే చలిగా ఉన్నప్పుడు ఎక్కువ ఉధృతి ఉంటుందన్నారు. తేనెలాంటి బంక ఆకులపై చేరడంతో సూర్యరశ్మి వెలుగులో మెరుస్తుందని తెలిపారు. తేనెమంచు నివారణకు లీటర్ నీటిలో డైమిథోయేట్ 2 మి.లీ లేదా క్లోరిపైరిపాస్ తగు మోతాదులో నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

కాండం తొలిచే పురుగు

కాండం తొలిచే పురుగు సోకినప్పుడు చెట్టు ఎండిపోతుందని, గట్టి ఇనుప తీగ సహాయంతో పురుగును తొలిగించాలన్నారు. పురుగు విసర్జన, పురుగు కొమ్మను తట్టినప్పుడు వచ్చే శబ్దాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

కాయతొలుచు పురుగు

ఎండు పుల్లలో నిద్రావస్థ దశలో రెక్కల పురుగు వెలువడి కాయల మీద గుడ్డు పెడుతుందన్నారు. ఈ పురుగు మామిడి పండ్ల దశలో మూడు తరాలు వృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పంటను ఆశిస్తాయని, పురుగు ఆశించిన చెట్టును తొలిగించాలని సూచించారు.

ఈసారి మామిడికి వాతావరణం అనుకూలం
ఈనెలలో జాగ్రత్తలు పాటించడమే కీలకం
మామిడి రైతులకు పలు సూచనలు చేసిన రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగహర్షిత

మామిడి చెట్టు కాయలకు తొడుగులుగా ఏర్పాటు చేసిన కవర్స్

పిండి నల్లి

భూమిలో పొదగబడిన గుడ్డు, పిల్లపురుగులు చెట్లపైకి పాకుతుందన్నారు. చీమల ద్వారా పైకి పాకి గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. దీనివల్ల కాయలు సరిగ్గా ఎదగకుండా రాలిపోతాయన్నారు. నివారణకు మిథైల్ పెరాథియాన్‌ను పిచికారీ చేయాలపి సూచించారు. టెంకపురుగు కాయలోపలికి చొచ్చుకుని పోయి లోపలగోకి తింటుందని, ఇది ఆలస్యంగా కోతదశలో కనిపిస్తుందన్నారు. నివారణకు మి.లీ ఫినిట్రోథియాను లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.

తెగుళ్లు మసిమంగు

ఆకులు, పూత, పిందెలు, కాయలమీద రసం పీల్చే తేనెమంచు పురుగు, పిండినల్లి, తామర పురుగులు, చీడపీడలు ఆశించినప్పుడు (సోకినప్పుడు).. అవి విసర్జించిన తేనెలాంటి పదార్థం పై శిలీంధ్రాలు క్యాప్‌నోడియం పరాన్న భుక్కులుగా పెరిగి నల్లని మసి తెగుళ్లు వస్తుందన్నారు. కొంతకాలం తర్వాత ఇవి మసిమంగుగా మారుతుందన్నారు. తెగుళ్లు సోకిన కాయలపై నల్లని మచ్చలుగా ఏర్పడి అవి అమ్మకానికి డిమాండ్ లేకుండా పోతాయని తెలిపారు. ఇది ఎక్కువగా మార్చి నెలలో దీని ప్రభావం ఉంటుందని, కనుక జాగ్రత్త అవసరం అన్నారు. జిగురు లేని కాయలపై మసి తెగుళ్లు సోకదని, ఆకు మసి తెగుళ్లు కనిపిస్తే.. 2 శాతం గంజి ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు.

బూడిద తెగుళ్లు

ఈ తెగులు ఆకు మీద, పూరెమ్మల పైన, బూడిద వంటి తెల్లని పదార్థం వ్యాపించి పూత, పిందె రాలిపోతుందన్నారు. ఇది పూత కాలంలో కనబడుతుందన్నారు. నివారణకు నీటిలో కరిగే గంధకం 3గ్రాములు, లేదా కెరాథేన్ మి.లీ కలిపి పిచికారీ చేయాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగహర్షిత సూచించారు.

బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా
గాలి అనిల్‌కుమార్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, చిత్రంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పార్టీ సీనియర్ నాయకుడు శివకుమార్

- బీసీ నేతకు టికెట్ ఖరారు చేసిన పార్టీ అధినేత కేసీఆర్
- అభ్యర్థిత్వంపై బీఆర్ఎస్ శ్రేణుల హర్షం
- అనిల్‌కుమార్ పేరు ఖరారుతో మాడ్గి గ్రామస్తుల్లో సంతోషం

సంగారెడ్డి, మార్చి 13 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ నుంచి జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ నేత గాలి అనిల్‌కుమార్ ఖరారయ్యారు. పార్టీ అధినేత కేసీఆర్ బుధవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల సమక్షంలో అనిల్‌కుమార్ పేరును ప్రకటించారు. దీంతో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ ఎన్నికల్లో అనిల్‌కుమార్ గెలుపొందటం ఖాయమని చెబుతున్నాయి. జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామానికి చెందిన గాలి అనిల్‌కుమార్‌కు ఎంపీ టికెట్ దక్కడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ఆశించారు. ఇటీవలే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన నివాసంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశమై అభ్యర్థి ఎంపికపై చర్చించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన నాయకులు తమ సామాజికవర్గానికి చెందిన నేతకు టికెట్ ఇవ్వాలని బీఆర్ఎస్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి వినతి పత్రాలు అందజేయగా, ఈ విషయాన్ని అధినేత కేసీఆర్ కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

బీసీ నేతకే కేసీఆర్ మొగ్గు

జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఎంపిక కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం మరోమారు పార్టీ ముఖ్యులతో చర్చించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఇతర ముఖ్య నాయకులతో ఎంపీ అభ్యర్థి ఎంపికపై మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న ముఖ్యనేతలు గాలి అనిల్‌కుమార్ మద్దతు పలకడంతో కేసీఆర్ బీసీ సామాజికవర్గానికి చెందిన గాలి అనిల్‌కుమార్‌వైపు మొగ్గుచూపారు. జహీరాబాద్ పార్లమెంట్ నేతలు సమక్షంలోనే మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన అనిల్‌కుమార్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. కేసీఆర్ తనను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంపై గాలి అనిల్‌కుమార్ సంతోషంగా వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకున్న తనకు అధినేత కేసీఆర్ న్యాయం చేశారని తెలిపారు. ప్రజల మద్దతుతో ఎంపీగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు ఎంపీ టికెట్ ఇచ్చిన కేసీఆర్, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎమ్మెల్యే టికెట్ ఇవ్వని కాంగ్రెస్.. ఎంపీ టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్

కాంగ్రెస్ పార్టీ బీసీ నేత గాలి అనిల్‌కుమార్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా మోసం చేస్తే బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఇచ్చి గౌరవించింది. గాలి అనిల్‌కుమార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి నర్సాపూర్ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని చివరి వరకు ఆశ చూపించి టికెట్ ఇవ్వలేదు. కాంగ్రెస్ అధిష్టానం తను మోసం చేసిందని గ్రహించిన అనిల్‌కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన గాలి అనిల్‌కుమార్‌కు అధినేత కేసీఆర్ జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చారు. గాలి అనిల్‌కుమార్ జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలంలోని మాడ్గిలో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఎంపీ టికెట్ దక్కడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాలు, కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

గోదావరి నీళ్లిచ్చి పంటలు కాపాడాలి

చేర్యాలలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- కాంగ్రెస్ సర్కారు ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదు
- జీవో 824తో చేర్యాల, జనగామ మున్సిపాలిటీలకు నిధులు మంజూరు
- అధికారులు, సిబ్బందిని బెదిరిస్తున్న కొమ్మూరి, ఆయన కుమారులు
- పార్టీలో చేరని వారిని సైతం చేరినట్లు ప్రకటించుకోవడం విడ్డూరం
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 13: రాష్ట్ర ప్రభుత్వం తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లకు వెంటనే గోదావరి జలాలు పంపింగ్ చేసి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని చెరువులు, కుంటలు నింపి పంటలు కాపాడాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాలలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునే మనస్సు కాంగ్రెస్ సర్కారుకు లేదని, గోదావరి జలాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఎందుకు తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్ నింప డం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి మంత్రి కేటీఆర్ జీవో నెం.824 ద్వారా చేర్యాల మున్సిపాలిటీకి రూ.10 కోట్లు, జనగామ మున్సిపాలిటీకి రూ.25 కోట్లు నిధులు మంజూరు చేయించానని, ఆ నిధులతో ఓటమి పాలైన నాయకులు ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు తెలిపారు. తాను ఇగోలకు పోదల్చుకోలేదని, తాను తెచ్చిన నిధులతోపాటు అధికార పార్టీ సదరు నేత మరిన్ని నిధులు తీసుకువచ్చి జనగామ, చేర్యాల ప్రాంతాలను అభివృద్ధి చేస్తే బాగుంటుందన్నారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో కొమ్మూరి తన కుమారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి, తాము చెప్పిందే వినాలని, లేని పక్షంలో ఊరుకునేది లేదని బెదిరించారని, నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలకు వారే బాధ్యులు కావాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గంలో బలంగా ఉందని, చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ వంగా చంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరినట్లు ఆ పార్టీ నేతలు ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ సర్కారుకు నిరుద్యోగులపై ప్రేమ ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు గ్రామాల్లో, పట్టణాల్లో బీఆర్ఎస్ శ్రేణులతోపాటు ఇతరులను బెదిరిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో ఎంపీపీ పుల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలు, గదరాజు చందు, ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి గదరాజు యాదగిరి, శివగారి అంజయ్య, నర్ర ఐలయ్య, బూరగోని తిరుపతిగౌడ్, పచ్చిమడ్ల చిన్న సతీశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ బండకింది కరుణాకర్, ఏర్పుల మహేశ్, ముత్యం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువకులు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి

యువకులు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని వీరభద్ర సినిమా టాకీస్ ఏరియాలో యువకులు ఏర్పాటు చేసుకున్న మా మొబైల్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి కల్పించే వరకు వేచి ఉండడానికి బదులుగా ఉపాధి మార్గాలు ఎంచుకుని జీవనం సాగిస్తే తల్లిదండ్రులతో పాటు స్నేహితులు సంతోషిస్తారని తెలిపారు. కార్యక్రమంలో షాపు నిర్వాహకులు జితేంద్‌రెడ్డి, బాల్ లింగం, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, తాళ్లపల్లి రాజు తదితరులున్నారు.

గుమ్మడిదల: బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం

ఆలయ ధర్మకర్తల కమిటీలకు
నోటిఫికేషన్ జారీ

గుమ్మడిదల, మార్చి 13: సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని ప్రసిద్ధ క్షేత్రాలకు ధర్మకర్తల కమిటీలను ఏర్పాటు చేయుటకు దేవాదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ జారీచేసిందని ఈవో శశిధర్‌గుప్తా తెలిపారు.బుధవారం సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదల మండలం బొంతపల్లి భద్రకాళీ వీరభద్రస్వామి దేవాలయంలో ఆయ న మాట్లాడారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ అడిషన్ కమిషనర్ కృష్ణవేణి ప్రకటించినట్లు ఈవో పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం, పటాన్‌చెరులోని రుద్రారం గణేశ్ దేవాలయం, ఝరాసంఘంలోని కేతకీ సంగమేశ్వరస్వామి దేవాలయం, సిద్దిపేట జిల్లా వర్గల్‌లోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయాలకు నూతన ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసినట్లు ఆయన తెలిపారు. 20 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

21న తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

తూప్రాన్, మార్చి 13 : తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై కొంత మంది సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం ఈనెల 6న నెగ్గిన విషయం తెలిసిందే. అవిశ్వాసం నెగ్గిన విషయాన్ని సంబంధిత అధికారులు ఎన్నికల కమిషన్‌కు పంపించి, తదుపరి ఆదేశాల కోసం ఎదురుచూశారు. ఈనెల 21న నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించడానికి ఎలక్షన్ కమిషన్ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. ఇదే విషయమై తూప్రాన్ ఆర్డీవో వివరణ కోరగా.. ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు రాలేదని తెలిపారు.

18న తూప్రాన్ మున్సిపల్ తైబజార్ వేలం

తూప్రాన్, మార్చి 13 : మార్చి 18న సోమవారం ఉదయం 11 గంటలకు తూప్రాన్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 2024-25 సంవత్సరానికి తైబజార్, పశువుల సంతకు వేలం పాట నిర్వహించనున్నట్లు తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తగిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో లేదా 9440402721 నెంబర్‌లో సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థిగా
రఘునందన్‌రావు

దుబ్బాక టౌన్, మార్చి 13: మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా దుబ్బాక మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావుకు అవకాశం దక్కింది. బుధవారం సాయంత్రం రెండో జాబితాలో రఘునందన్‌రావు పేరును బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది. రఘునందన్‌రావు ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2018లో దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన సోలిపేట రామలింగారెడ్డి చేతిలో ఓడిపోగా, ఆయన అనారోగ్యంతో 2020లో మరణించాడు. అదే సంవత్సరం నవంబర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేసిన రఘునందన్‌రావు టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాతపై విజయం సాధించారు. రఘునందన్‌రావు 2014, 2018 ఎన్నికల్లో సైతం బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి చేతిలో ఓటమి చవిచూశారు.

కేంద్ర పథకాలతో పేదలకు లబ్ధి

గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

సంగారెడ్డి, మార్చి 13(నమస్తే తెలంగాణ): పేదలకు లబ్ధి చేకూరేలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రారంభిస్తుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. బుధవారం ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్‌గా పీఎం-సూరజ్ పోర్టల్‌ను ప్రారంభించారు. కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా సంగారెడ్డి జిల్లాకు సంబంధించిన పీఎం-సూరజ్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేషనల్ బ్యాక్‌వర్డ్ క్లాస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లబ్ధిదారులతో వర్చువల్‌గా మాట్లాడారు. సఫాయి కర్మచారి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ లబ్ధిదారులతో ప్రధాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పాల్గొని మాట్లాడుతూ ప్రధాన మంత్రి సామాజిక్ ఉత్థాన్ ఏవం రోజ్‌గార్ ఆధారిత్ జనకల్యాణ్ (PM-SURAJ) కార్యక్రమం ద్వారా వెనకబడిన తరగతులకు చెందిన పేదలకు సులభంగా రుణాలు లభిస్తాయని తెలిపారు. బ్యాంకు రుణాలతో వెనకబడిన తరగతులకు చెందిన లబ్ధిదారులు వ్యాపారాలు చేసి ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రధాని మోదీ పేదల కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌బీఐ సీజీఎం రాజేశ్‌కుమార్, కెనరా బ్యాంకు డీజీఎం శ్రీనివాస్‌రావు, ఐఐటీ హైదరాబాద్ డీన్ చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలోని ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్